సాక్షి అనకాపల్లి

ఆదివారం । 12 । అక్టోబర్ । 2025



పోస్టర్ ఆవిష్కరణ
డాబాగార్డెన్స్: విశాఖలో డిసెంబర్ 31 నుంచి సిటు అఖిల భారత మహాసభలు నిర్వహించనున్నారు. శనివారం మహాసభల పోస్టర్ ఆవిష్కరించారు.



రైతుల ధర్నా
గోవాడ సుగర్స్ మహాజన సభను వెంటనే నిర్వహించాలని ఫ్యాక్టరీ పరిరక్షణ పోరాట కమిటీ ఆధ్వర్యంలో ఫ్యాక్టరీ గేటు వద్ద రైతులు ధర్నా చేశారు. 8లో



16 నుంచి పవిత్రోత్సవాలు
పద్మనాభం: కుంతీ మాధవ స్వామి ఆలయంలో ఈ నెల 16 నుంచి 19 వరకు పవిత్రోత్సవాలు నిర్వహించనున్నట్టు ఈవో పీఎల్ఎన్ రాజు తెలిపారు.

స్టీల్‌ప్లాంట్‌కు భూములు ఇవ్వం

ఆర్డీవోకు వినతిపత్రం ఇచ్చిన నెల్లిపూడి రైతులు



ఆర్డీవోకు వినతి పత్రం ఇస్తున్న నెల్లిపూడి రైతులు

నక్కపల్లి: మండలంలో ఏర్పాటు కాబోతున్న ఆర్సెలర్ మిట్టల్ నిప్పన్ స్టీల్‌ప్లాంట్‌కు తమ గ్రామంలో భూములు ఇవ్వబోమని నెల్లిపూడి రైతులు స్పష్టం చేశారు. శనివారం వారంతా నక్కపల్లి తహసీల్దార్ కార్యాలయంలో ఆర్డీవో వి.వి.రమణను కలిశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ నెల్లిపూడి గ్రామంలో సుమారు 200 ఎకరాల భూములు స్టీల్ ప్లాంట్ లేబర్ కాలనీ కోసం సేకరిస్తున్నట్లు తహసీల్దార్ ద్వారా తమకు సమాచారం వచ్చిందన్నారు. ప్రభుత్వం స్టీల్‌ప్లాంట్ కోసం గుర్తించిన భూములపై తరతరాలుగా రైతులు ఆధారపడి సాగు చేసుకుంటున్నారన్నారు. పచ్చని కొబ్బరి తోటలతో మరో కోనసీమగా ప్రసిద్ధి పొందిన తమ భూములను స్టీల్‌ప్లాంట్ కోసం ఇవ్వడానికి నిరాకరిస్తున్నామన్నారు. భూములు కోల్పోతే రైతులంతా ఉపాధి లేక రోడ్డున పడాల్సిన పరిస్థితులు ఏర్పడతాయన్నారు. కొబ్బరి తోటలపై రైతులతోపాటు **వ్యవసాయ** కూలీలు, ఇతర సామాజిక వర్గాల **వారు** కూడా ఆధారపడి జీవిస్తున్నారన్నారు. **తమ వినతి**ని ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లాలని వారు **కోరారు.** ఆర్డీవోను కలిసిన వారిలో వైఎస్సార్‌సీపీ రాష్ట్ర కార్యదర్శి వీసం రామకృష్ణ, రైతులు చినపేర్రాజు, సురేష్‌రాజు, రామచంద్రరాజు, వెంకటపతిరాజు, ఎరిపిల్లి చిన అబ్బాయి, లక్ష్మీపతిరాజు, రాకాతి అన్నవరం, రావి చిన్న తదితరులు ఉన్నారు.

మహోన్నత వ్యక్తిత్వం జస్టిస్ రామస్వామి సొంతం



జస్టిస్ రామస్వామి చిత్రపటాన్ని ఆవిష్కరిస్తున్న ఏపీ హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ బట్టు దేవానంద్

ఏపీ హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ బట్టు దేవానంద్

మద్దిలపాలెం: ఆంధ్ర విశ్వవిద్యాలయంలో సుప్రీం కోర్టు పూర్వ న్యాయమూర్తి జస్టిస్ డాక్టర్ కె. రామస్వామి చిత్రపటాన్ని శనివారం ఆంధ్రప్రదేశ్ హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ బట్టు దేవానంద్ ఆవిష్కరించారు. గతంలో జస్టిస్ కె.రామస్వామి ఏయూలో 'పబ్లిక్ పవర్ అండ్ జ్యుడీషియల్ ఫంక్షన్' అనే అంశంపై అందించిన ప్రసంగాన్ని పునర్ ముద్రించిన పుస్తకాన్ని కూడా జస్టిస్ దేవానంద్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. జస్టిస్ రామస్వామిది మహోన్నత వ్యక్తిత్వమని కొనియాడారు. విద్యార్థి నాయకుడిగా తాను తొలిసారిగా ఆయనను కలిసిన సందర్భం, ఏయూకు ముఖ్యఅతిథిగా ఆహ్వానించి తీసుకు వచ్చిన సందర్భాలను ఆయన గుర్తు చేసుకున్నారు. జస్టిస్ రామస్వామి చారిత్రాత్మకమైన తీర్పులు అందించారని పేర్కొన్నారు. తాను ఉన్నత స్థానంలో నిలవడానికి తన గురువులు అందించిన అత్యుత్తమ బోధన, మార్గదర్శకమే కారణమని, ఈ అవకాశాన్ని దైవం ఇచ్చిన వరంగా భావిస్తున్నానని జస్టిస్ దేవానంద్ అన్నారు. విద్యాబుద్ధులు నేర్పిన ఆచార్యులకు తాను ఎల్లప్పుడూ రుణపడి ఉంటానని వేదికపై స్మరించుకున్నారు. ఈ కార్యక్రమంలో ఏయూ వీసీ ఆచార్య జీపీ రాజశేఖర్ పాల్గొన్నారు.

ప్రభుత్వ భూమిపై ప్రైవేటు వసూళ్లు!



200 మంది నుంచి ఏకంగా రూ.50 కోట్లు స్వాహా!

- ప్రభుత్వ భూమిని ప్రైవేటు భూమిగా నకిలీ డాక్యుమెంట్లు
- ఏకంగా నకిలీ ఈసీ సృష్టించిన ముఠా
- విద్యుత్‌శాఖలో పనిచేస్తున్న ఇద్దరు డీఈల నిర్వాకం

సాక్షి ప్రతినిధి, విశాఖపట్నం:

ప్రభుత్వ భూమిని ప్రైవేటుగా చూపించి ఏకంగా రూ.50 కోట్లు వసూలు వ్యవహారం చర్చనీయాంశమవుతోంది. ఇందుకోసం ఇద్దరు తహసీల్దార్ల పేరుతో నకిలీ డాక్యుమెంట్లు, నకిలీ ఎండార్స్‌మెంట్లతో పాటు ఏకంగా నకిలీ ఈసీని కూడా సృష్టించిన వ్యవహారం తాజాగా వెలుగులోకి వచ్చింది. విద్యుత్ శాఖలో పనిచేసే ఇద్దరు ఇంజనీర్లు (డీఈలు) ఈ తతంగమంతా నడిపించారు. తమతో పాటు పని చేసే సుమారు 200 మంది నుంచి చెరో రూ.25 లక్షల చొప్పున మొత్తం రూ.50 కోట్ల వరకూ వసూలు చేశారు. మధురవాడ పనోరమ హిల్స్ జంక్షన్‌కు సమీపంలోని సర్వే నెంబరు 368–3లోని భూమిని చూపించి వసూళ్లకు తెగబడినట్టు తెలుస్తోంది. వాస్తవానికి ఇది ప్రభుత్వ భూమి. మొత్తం విస్తీర్ణం 3.6 ఎకరాలు. ఇక్కడ ఎకరా విలువ రూ.20 కోట్లకుపైగానే పలుకుతోంది. 100 అడుగుల రోడ్డుకు ఆనుకుని ఉన్న ఈ భూమి తక్కువ ధరకే అందుబాటులోకి వచ్చిందంటూ నమ్మించి భారీగా వసూలు చేశారు. ఇందుకోసం ఇద్దరు తహసీల్దార్ల పేరుతో ఫలానా వారికి పట్టా ఇచ్చారంటూ నకిలీ రికార్డులు సృష్టించారు. చలానాలు కూడా కట్టించి రిజిస్ట్రేషన్ల శాఖ సిబ్బందితో కలిసి రిజిస్ట్రేషన్‌ను పెండింగ్‌లో ఉంచేలా కథ నడిపించారు. నకిలీ ఈసీని కూడా సృష్టించి నమ్మించారు. అయితే, అవి నకిలీవని తెలియడంతో వారంతా ఇప్పుడు ఉసూరుమంటున్నారు. వారికి ఇప్పుడు మరో భూమిని చూపించి రిజిస్ట్రేషన్ చేస్తామంటూ కొత్త నాటకానికి తెరలేపినట్టు సమాచారం.




రూరల్ తహసీల్దార్ నరసింహమూర్తి పేరుతో సృష్టించిన నకిలీ వన్ బీ

రూ.50 కోట్లు వసూళ్లు!

ఈ సర్వే నెంబరులోని భూమి తక్కువ ధరకే ఒక్కొక్కరికి రిజిస్ట్రేషన్ చేపిస్తామంటూ నమ్మబలికి మొత్తం 200 మంది నుంచి రూ.25 లక్షల చొప్పున వసూలు చేసినట్టు తెలుస్తోంది. వీరంతా విద్యుత్ శాఖలో పనిచేస్తున్న ఉద్యోగులు కావడం గమనార్హం. ఈ ముఠాకు నేతృత్వం వహిస్తున్న ఇద్దరు వ్యక్తులు కూడా విద్యుత్‌శాఖలో ఇంజనీర్లుగా పనిచేస్తున్నారు. గతంలో ఈ విధంగానే 50 మంది నుంచి చెరో రూ.25 లక్షలు వసూలు చేసి ఒక ప్రైవేటు భూమిని కొనుగోలు చేసి రిజిస్ట్రేషన్ చేయించడంతో వీరిపై నమ్మకం కుదిరింది. దీన్ని వాడుకుని ఈసారి ఏకంగా 200 మంది నుంచి రూ.25 లక్షల చొప్పున మొత్తం రూ.50 కోట్లు వసూలు చేశారు. విద్యుత్‌శాఖలో తమకు ఉన్న పరిచయాల ద్వారా తమ సిబ్బంది నుంచే ఈ విధంగా వసూళ్లకు పాల్పడ్డారు. అంతేకాకుండా ఎప్పటికప్పుడు కూట మి నేత, మాజీ హోం మంత్రి అండదండలున్నాయని కూడా బలంగా నమ్మించినట్టు తెలుస్తోంది.

తహసీల్దార్ల పేరుతో నకిలీ డాక్యుమెంట్లు..!

మధురవాడలోని సర్వే నెంబరు 368–3లోని భూమి ప్రభుత్వానికి చెందినది. ఈ భూమిని లింగం సోమసుందరరావు పేరుతో పట్టా ఇచ్చారంటూ సెటిల్‌మెంట్ పట్టాను సృష్టించారు. గతంలో విశాఖ రూరల్ తహసీల్దార్లగా పనిచేసిన నరసింహమూర్తితో పాటు హత్యకు గురైన సనపాల రమణయ్య పేరు మీద నకిలీ డాక్యుమెంట్లు సృష్టించారు. నకిలీ అడంగల్, నకిలీ పట్టాలతో పాటు పై ఇద్దరూ తహసీల్దార్లు కూడా ఈ సర్వే నెంబరులో ఫలానా వ్యక్తికి పట్టా ఉందంటూ నివేదిక ఇచ్చినట్టు కూడా నకిలీ పత్రాలు ఏర్పాటు చేశారు. వసూలు చేసిన వారికి వీటిని చూపించడంతో పాటు రిజిస్ట్రేషన్ సిబ్బందితో కలిసి వ్యవహారం నడిపించారు. ఈ వ్యవహారంలో రిజిస్ట్రేషన్ శాఖలోని కొద్దిమంది సిబ్బందికి ఏకంగా రూ.కోటి వరకూ ముట్టచెప్పినట్టు ఆరోపణలు వినిపిస్తున్నాయి.



సర్వే ఏడీ జారీ చేసిన సెటిల్‌మెంట్ రికార్డు వివరాలు

రిజిస్ట్రేషన్ శాఖ సిబ్బందితో కలిసి..!

వాస్తవానికి ఈ సర్వే నెంబరులోని భూమి ప్రభుత్వానికి చెందినదని స్పష్టంగా రికార్డుల్లో ఉంది. నిషేధిత జాబితా (22ఏ)లో ఉంది. అందువల్ల రిజిస్ట్రేషన్ చేయడం కుదరదు. అయినప్పటికీ మధురవాడ సబ్ రిజిస్ట్రార్ కార్యాలయానికి చెందిన ఒక అధికారితో మాట్లాడుకుని మొదటి దశలో ఒక 30 మంది రిజిస్ట్రేషన్‌కు వస్తారని... వారి నుంచి చలానా కట్టించుకుని రిజిస్ట్రేషన్ ప్రక్రియ ప్రారంభించాలని కోరారు. ఇది ప్రభుత్వ భూమి కావడంతో రిజిస్ట్రేషన్ చేయడం కుదరనందున.. చలానాలు కట్టించుకుని రిజిస్ట్రేషన్ చేసినట్టుగా చేసి సహకరించాలని విన్నవించారు. ఆ తర్వాత రిజిస్ట్రేషన్‌ను పెండింగ్‌లో ఉంచితే చాలని కోరారు. ఇందుకోసం భారీగానే మాముళ్లు మాట్లాడుకున్నట్టు తెలుస్తోంది. ఈ విధంగానే మొత్తం వ్యవహారం నడిచింది. ఒక్కొక్కరు చెరో రూ.3 లక్షల నుంచి రూ.4 లక్షల మేర చలానా కూడా కట్టారు. తమకు రిజిస్ట్రేషన్ అయ్యిందని మొదటి బ్యాచ్ సంబరపడిపోయింది. మిగిలిన బ్యాచ్‌కు కూడా త్వరలో పెడతానంటూ సదరు ముఠా నమ్మబలికింది. అంతేకాకుండా మొదటగా రిజిస్ట్రేషన్ చేసిన వారికి దొంగ ఈసీలను కూడా సృష్టించి అందజేయడం గమనార్హం. విజయవాడలోని ఒక నిపుణుడైన డీటీపీ కార్యాలయంలో ఈ ఫేక్ ఈసీని సృష్టించి.. వారి పేరు మీద రిజిస్ట్రేషన్ అయినట్టుగా చూపించారు. అయితే కొందరు అవసరాల నిమిత్తం ఈ భూమిని విక్రయించడానికి ప్రయత్నించగా ఈసీ నకిలీదని తెలియడం అవాక్కయ్యారు. ఇప్పుడు అదే ముఠా కూటమిలోని ఒక నేత పేరుతో కొత్త సర్వే నెంబరుతో రిజిస్ట్రేషన్ కోసం దిగినట్టు తెలుస్తోంది.

ఆడబిడ్డలకు అన్యాయం



'సూపర్ సిక్స్ పథకాలన్నింటినీ అమలు చేసేశాం.. ఆడబిడ్డ నిధిని పీ4కు అనుసంధానం చేస్తాం.. ఇది పేదల ఇంట కొత్త వెలుగు' అని విశాఖలో చంద్రబాబు చెప్పారు. అమలు గాని హామీతో మహిళలను మోసం చేయడమే కాకుండా.. పీ4 పేరిట కాలయాపన చేస్తున్నట్లు మహిళలు సైతం మండిపడుతున్నారు. ఎన్నికల ముందు ఆడబిడ్డ నిధి ద్వారా లబ్ధి చేకూరుతుందని ఆశపడ్డ అక్క చెల్లెమ్మలు కూటమి ప్రభుత్వంపై కారాలు మిరియాలు నూరుతున్నారు.

- పీ4తో అనుసంధానం చేసి చేతులు దులుపుకున్న చంద్రబాబు
- బంగారు కుటుంబాలను దాతలే ఆదుకోవాలంటున్న సర్కారు
- దాతలను వెతికే పనితో తలలు పట్టుకుంటున్న ఉద్యోగులు

జిల్లాలో గుర్తించిన బంగారు కుటుంబాలు	80,163
ముందుకు వచ్చిన మార్గదర్శులు	6,420
వారు దత్తత తీసుకున్న కుటుంబాలు	47,597
దాతల కోసం ఎదురుచూస్తున్న కుటుంబాలు	32,571

సాక్షి, అనకాపల్లి:

ఆడబిడ్డను ఆదుకుంటానని ఓట్లు వేయించుకున్నారు.. అధికారం చేతికిచ్చాక అక్కచెల్లెమ్మలను నిలువునా ముంచేశారు. 'ఆడబిడ్డ నిధి' పేరిట 18 –60 ఏళ్ల లోపు మహిళలకు ప్రతి నెలా రూ.1500 ఇస్తామని కూటమి నేతలు హామీ ఇచ్చారు. దీనిని సూపర్ సిక్స్‌లో పెట్టి మేనిఫెస్టోను బాగా ప్రచారం చేసుకున్నారు. ఈ పథకం ప్రారంభం కాకుండానే సూపర్ సిక్స్ సూపర్ హిట్ అంటూ చెవుల్లో పువ్వులు పెడుతున్నారు. తాంబూలాలు ఇచ్చేశాం.. తన్నుకు చావండి.. అన్నట్లు పీ4తో అనుసంధానం చేసేశాం. ఇక దాతలదే భారం అని చేతులెత్తేశారు. జిల్లాలో 80,163 బంగారు కుటుంబాలను గుర్తించి, దాతలను వెదికే బాధ్యతను ఉద్యోగులకు అప్పగించారు. ఎవరూ ముందుకు రాకపోవడంతో అధికారులు తలలు పట్టుకుంటున్నారు. బంగారు కుటుంబాలను దత్తత చేసుకోమని మద్యం షాపులను నడిపేవారిని, చిన్నా చితకా వ్యాపారాలు చేసుకునేవారిని బతిమాలి, భయపెట్టి రకరకాల విన్యాసాలు చేసినా ఫలితం లేకపోయింది.

దాతలు కావలెను

పీ4 కోసం దాతలను వెదికే పని అధికారులకు జీవన్మరణ సమస్యగా మారింది. ప్రభుత్వం శాఖల వారీగా బాధ్యతలు అప్పగించినా ఫలితం లేకపోయింది. తమకు అప్పగించొద్దంటూ ఉపాధ్యాయులు పీ4 ప్రక్రియకు పూర్తిగా దూరమయ్యారు. ఇక ఆ ప్రక్రియలో గ్రామ, వార్డు సచివాలయ సిబ్బందిని కూడా కలిపారు. నెల క్రితం బంగారు కుటుంబాల మార్గదర్శకాల మ్యాపింగ్ పూర్తిచేయాలంటూ ప్రభుత్వం ఆదేశాలను కూడా జారీ చేసింది. అంతేకాకుండా పీ4 కార్యక్రమంలో బంగారు కుటుంబాలకు, మార్గదర్శులకు సంధానకర్తలుగా వ్యవహరించాలంటూ కూడా ఒత్తిడి పెంచింది. వలంటీర్ వ్యవస్థను నిలిపివేయడంతో అసలే పని భారం పెరిగిన సచివాలయ ఉద్యోగులు జిల్లా ఉన్నతాధికారుల ఒత్తిడి మేరకు నామమాత్రంగానే ఈ ప్రక్రియలో పాల్గొంటున్నారు.

ఆడబిడ్డలకు రూ.1,314 కోట్లు బాకీ పడ్డ బాబు సర్కారు

జిల్లావ్యాప్తంగా 18–60 ఏళ్ల వయసున్న 5,47,888 మంది పేద మహిళలను గుర్తించినట్లు అధికారుల గణాంకాలు చెబుతున్నాయి. కూటమి ప్రభుత్వం అధికారం చేపట్టి 16 నెలలు పూర్తయింది. అంటే ఒక్కొక్కరికి నెలకు రూ.1500 చొప్పున 5,47,888 మంది మహిళలకు 16 నెలలకు రూ.1,314 కోట్లు ప్రభుత్వం ఇప్పటివరకు చెల్లించాల్సి ఉంది.

వెబ్‌సైట్‌లో కాకి లెక్కలు

అధికారిక వెబ్‌సైట్‌లో అధికారులు పొందుపరిచిన గణాంకాల ప్రకారం జిల్లాలోని ఏడు నియోజకవర్గాల్లోని 522 సచివాలయాల పరిధిలో మొత్తం 80,163 బంగారు కుటుంబాలను గుర్తించారు. ఆ కుటుంబాల్లో 2,06,526 మంది సభ్యులున్నట్టు లెక్కకట్టారు. వీరిని దత్తత తీసుకునేందుకు జిల్లాలో 6,420 మంది మార్గదర్శులు ముందుకు వచ్చినట్లు వెబ్‌సైట్‌లో పెట్టారు. ఇప్పటికి 47,597 కుటుంబాలను మార్గదర్శులు దత్తత చేసుకున్నట్లు.. ఇంకా 32,571 కుటుంబాలను దత్తత చేసుకోవాల్సి ఉన్నట్లుగా వెబ్‌సైట్‌లో పేర్కొన్నారు. కానీ క్షేత్ర స్థాయిలో వారి వివరాలు ఏమీ లేవు. ఎవరు ఏ కుటుంబాన్ని దత్తత చేసుకున్నారనే వివరాలు క్షేత్రస్థాయిలో సచివాలయాల వారీగా పొందుపరచలేదు. సచివాలయ ఉద్యోగులను, అధికారులను అడిగితే వెబ్‌సైట్‌లో చూసుకోవాలని చెబుతున్నారే తప్ప ఏ కుటుంబాన్ని ఎవరు దత్తత తీసుకున్నారనే వివరాలను పొందుపరచడం లేదు. ఇవన్నీ కాకిలెక్కలేనన్న విమర్శలు వినిపిస్తున్నాయి.

వైఎస్సార్ సీపీ రాష్ట్ర సంయుక్త కార్యదర్శిగా రాంబాబు



దొండా రాంబాబు

బుచ్చెయ్యపేట: వైఎస్సార్ సీపీ రాష్ట్ర సంయుక్త కార్యదర్శిగా వడ్డాదికి చెందిన దొండా రాంబాబును నియమించారు. పార్టీ అధ్యక్షుడు వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి ఆదేశాల మేరకు పార్టీ కేంద్ర కార్యాలయం ఈమేరకు ఉత్తర్వులు జారీ చేసింది. బుచ్చెయ్యపేట మండలం వడ్డాదికి చెందిన రాంబాబు గోవాడ సుగర్ ఫ్యాక్టరీ సీడీసీ చైర్మన్‌గా, బుచ్చెయ్యపేట జెడ్పీటీసీగా, ఉమ్మడి విశాఖ జిల్లా జెడ్పీటీసీల ఫోరం సంఘ అధ్యక్షుడిగా పలు పదవులు నిర్వహించారు.

జీఎస్ఐతో ఏయూ ఒప్పందం

మద్దిలపాలెం (విశాఖ): ఆంధ్ర విశ్వవిద్యాలయం పరిశోధన, అభివృద్ధి రంగంలో మరో ముందడుగు వేసింది. జియోలాజికల్ సర్వే ఆఫ్ ఇండియా(జీఎస్ఐ)తో ఏయూ శనివారం అవగాహన ఒప్పందం కుదుర్చుకుంది. ఏయూ పాలక మండలి సమావేశ మందిరంలో జరిగిన ఈ కార్యక్రమంలో ఏయూ వీసీ ఆచార్య జీపీ రాజశేఖర్ సమక్షంలో ఒప్పందంపై సంతకాలు జరిగాయి. ఏయూ తరఫున రిజిస్ట్రార్ ప్రొఫెసర్ కె. రాంబాబు, జియోలాజికల్ సర్వే ఆఫ్ ఇండియా, హైదరాబాద్ డిప్యూటీ డైరెక్టర్ జనరల్ సత్య నారాయణ మహాపాత్రో సంతకాలు చేశారు. భారత ప్రభుత్వం నుంచి వచ్చిన ఇతర ప్రతినిధులు, సైన్స్ కళాశాల ప్రిన్సిపాల్ ఆచార్య ఎంవీఆర్ రాజు, పూర్వ రిజిస్ట్రార్ ఆచార్య ఇఎన్ ధనుంజయ రావు తదితరులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.



జీఎస్ఐతో ఎంవోయూ పత్రాలను మార్చుకుంటున్న ఏయూ వీసీ ఆచార్య రాజశేఖర్

క్లుప్తంగా

వైద్య కళాశాలల ప్రైవేట్‌పరంపై 14న బహిరంగ చర్చ

అల్లిపురం: మాజీ ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్ మోహన్‌రెడ్డి నేతృత్వంలోని వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయాంలో రాష్ట్రంలో నిర్మించిన 17 వైద్య కళాలలను కూటమి ప్రభుత్వం ప్రైవేట్ పరం చేయడం, అలాగే స్టీల్ ప్లాంట్ ప్రైవేటీకరణ అంశాలపై ద్వారకానగర్ పబ్లిక్ లైబ్రరీలో 14న బహిరంగ చర్చ కార్యక్రమం ఏర్పాటు చేస్తున్నట్టు ఆ పార్టీ లీగల్ సెల్ రాష్ట్ర అధికార ప్రతినిధి పాకా సత్యనారాయణ తెలిపారు. బహిరంగ చర్చలో వైఎస్సార్ సీపీ, సీపీఎం, సీపీఐ, బీఎస్పీ, స్టీల్ ప్లాంట్ కార్మిక సంఘాలు, న్యాయవాద సంఘాలు పాల్గొంటాయని ఆయన పేర్కొన్నారు.

డీఎస్‌డీవోగా పూజారి శైలజ

యలమంచిలి రూరల్: జిల్లా క్రీడాభివృద్ధి అధికారిగా విశాఖపట్నం వెయిట్ లిఫ్టింగ్ కోచ్‌గా పని చేస్తున్న పూజారి శైలజను నియమిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. ఇప్పటి వరకు అనకాపల్లి డీఎస్‌డీవో(కాంట్రాక్టు)గా విధులు నిర్వహిస్తున్న జిమ్నాస్టిక్స్ శిక్షకుడు ఎల్‌వీ రమణను విజయవాడ శాప్ హెడ్ క్వార్టర్స్‌కు బదిలీ చేశారు.

అద్భుతం.. నృత్యోత్సవం



కూచిపూడి నృత్య ప్రదర్శనలో చిన్నారులు

మద్దిలపాలెం(విశాఖ): కళాభారతిలో పద్మభూషణ్ డాక్టర్ వెంపటి చిన్న సత్యం 96వ జయంతిని పురస్కరించుకుని విశాఖ ఆర్ట్ అండ్ డ్యాన్స్ అసోసియేషన్ , వెంపటి చిన్న సత్యం స్థాపించిన కూచిపూడి కళాక్షేత్రం సంయుక్తంగా రెండు రోజుల ఆంధ్రప్రదేశ్ శాస్త్రీయ సంప్రదాయ నృత్యం, కూచిపూడి వెంపటి జయంతి నృత్యోత్సవాలు శనివారం ఘనంగా ప్రారంభించారు. తొలి రోజు కార్యక్రమంలో సుమారు 400 మంది చిన్నారులు తమ నృత్య ప్రదర్శనలతో ప్రేక్షకులను అబ్బురపరిచారు. నగరంలో గల నాట్య గురువులందరి సహకారంతో ఈ కార్యక్రమం అద్భుతంగా నిర్వహించారు. ముఖ్య అతిథులుగా సెంచురియన్ యూనివర్సిటీ చాన్సలర్ ప్రొఫెసర్ జీఎస్ఎన్ రాజు, వీఎండీఏ అధ్యక్షుడు ఎంఎస్ఎన్ రాజు, విజయనిర్మల్ అండ్ కంపెనీ చైర్మన్ అండ్ మేనేజింగ్ డైరెక్టర్ డాక్టర్ సూరపనేని విజయ్ కుమార్, విజయనిర్మల కంపెనీ చైర్మన్ ఎంఎస్ శ్రీనివాస్, కూచిపూడి కళాక్షేత్ర కార్యదర్శి కృష్ణ ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు. అనంతరం ప్రొఫెసర్ జీఎస్ఎన్ రాజు మాట్లాడుతూ నేటి తరం విద్యార్థులు ఏదో ఒక సంప్రదాయ నృత్యం, సంప్రదాయ కళ నేర్చుకోవాలని సూచించారు. ఈ సందర్భంగా విశాఖలోని నాట్య గురువులను సత్కరించారు.

వైద్య కళాశాలల ప్రైవేటీకరణపై ఉద్యమం

- మాజీ ఎమ్మెల్యే ఉమాశంకర్ గణేష్
- కోటి సంతకాల సేకరణ ప్రారంభం

నర్సీపట్నం: ప్రజలకు కార్పొరేట్ వైద్యం, పేద విద్యార్థులకు వైద్య విద్యను అందుబాటులోకి తీసుకురావాలన్న సంకల్పంతో మాజీ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి రాష్ట్రంలో 17 మెడికల్ కాలేజీలను ఏర్పాటు చేశారని మాజీ ఎమ్మెల్యే పెట్ల ఉమా శంకర్ గణేష్ స్పష్టం చేశారు. వీటిలో నర్సీపట్నం వైద్య కళాశాల ఒకటి అన్నారు. వీటిని కూటమి ప్రభుత్వం ప్రైవేటీకరించడాన్ని నిరసిస్తూ వైఎస్సార్ సీపీ కోటి సంతకాల సేకరణకు శ్రీకారం చుట్టింది. నర్సీపట్నంలోని పార్టీ కార్యాలయంలో శనివారం కోటి సంతకాల వాల్ పోస్టర్లను పార్టీ నాయకులతో కలిసి గణేష్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం వైద్య కళాశాలలను ప్రైవేటు వ్యక్తులకు ధారాదత్తం చేయటం దురదృష్టకరమన్నారు. ప్రభుత్వ నిర్ణయానికి వ్యతిరేకంగా వైఎస్సార్‌సీపీ ఆధ్వర్యంలో పోరాటం చేస్తున్నామన్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాగానే మెడికల్ కళాశాలలను నిలిపివేశారని ధ్వజమెత్తారు. వీటిని పీపీపీ విధానంలో నిర్మించాలని టెండర్లను ఆహ్వానించడం దారుణమన్నారు. ప్రైవేటు వ్యక్తుల ఆధీనంలో మెడికల్ కళాశాలలు ఉంటే పేదలకు ఉచిత వైద్యం ఎలా అందుతుందని ప్రశ్నించారు. వైద్య కళాశాలలను ప్రభుత్వమే నిర్వహించాలని డిమాండ్ చేస్తూ ప్రజల నుంచి కోటి సంతకాల ఉద్యమాన్ని నవంబరు 22 వరకు గ్రామాలు, పట్టణాల్లో నిర్వహిస్తామన్నారు. ఈ నెల 28న నియోజకవర్గ కేంద్రంలో ర్యాలీ నిర్వహించనున్నట్లు తెలిపారు. నవంబరు 12న జిల్లా కేంద్రంలో ర్యాలీ ఉంటుందన్నారు. ప్రజల నుంచి సేకరించిన సంతకాలను 23న జిల్లా కేంద్రాలకు పంపనున్నట్లు వెల్లడించారు. అనంతరం 24న పార్టీ కేంద్ర కార్యాలయానికి తరలించిన తరువాత గవర్నర్‌కు అందజేయనున్నట్లు చెప్పారు. ఈ ఉద్యమం రాజకీయ లబ్ధి కోసం చేసేది కాదని, ప్రజలందరూ స్వచ్ఛందంగా సంతకాల సేకరణలో పాల్గొని మద్దతు తెలియజేయాలని కోరారు. మున్సిపల్ వైస్ చైర్మన్ కోనేటి రామకృష్ణ, స్టేట్ యూత్ వింగ్ నాయకుడు చింతకాయల వరుణ్, పార్టీ పట్టణ అధ్యక్షుడు ఏకా శివ, ఎంపీపీ రుత్తల సర్వేశ్వరరావు, మాజీ ఎంపీపీ రుత్తల సత్యనారాయణ, మాకవరపాలెం, నర్సీపట్నం పార్టీ అధ్యక్షులు చిటికెల రమణ, శానపతి వెంకటరత్నం, జిల్లా నాయకులు బొడ్డు గోవిందరావు, పెట్ల భద్రాచలం, లెక్కల సత్యనారాయణ పాల్గొన్నారు.



పార్టీ నాయకులతో కలిసి కోటి సంతకాల వాల్‌పోస్టర్లను ఆవిష్కరిస్తున్న మాజీ ఎమ్మెల్యే గణేష్, తదితరులు

గోవాడ చక్కెర కర్మాగార రైతుల ధర్నా

మహాజన సభ వెంటనే జరిపించాలని డిమాండ్

చోడవరం: గోవాడ సుగర్ ఫ్యాక్టరీ మహాజన సభను వెంటనే నిర్వహించాలని రైతులు డిమాండ్ చేశారు. ఫ్యాక్టరీ పరిరక్షణ పోరాట కమిటీ ఆధ్వర్యంలో శనివారం ఫ్యాక్టరీ గేటు వద్ద రైతులంతా ధర్నా చేశారు. గత నెల 30న నిర్వహించాల్సిన ఫ్యాక్టరీ మహాజన సభను ఇప్పటి వరకూ నిర్వహించకపోగా, మరో ఆర్నెల్ల వరకూ వాయిదా వేస్తున్నట్టు ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేయడంపై తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. గత సీజన్‌కు సంబంధించిన చెరకు బకాయిలు వెంటనే చెల్లించాలని, ఫ్యాక్టరీకి ప్రభుత్వం రూ. 50 కోట్లు గ్రాంటు ఇవ్వాలని, ఈ ఏడాది క్రషింగ్ చేయడానికి కావలసిన పనులన్నీ చేపట్టాలని డిమాండ్ చేశారు. గేటు వద్ద పెద్ద ఎత్తున నినాదాలు చేశారు. ఎన్నికల్లో ఇచ్చిన హామీని కూటమి ప్రభుత్వం వెంటనే నిలబెట్టుకోవాలని డిమాండ్ చేశారు. మహాజన సభ నిర్వహించకపోతే ఆందోళన మరింత ఉధృతం చేస్తామని, ఫ్యాక్టరీని మూసివేస్తే చెరకు రైతుల పరిస్థితి ఏంటో ప్రభుత్వం చెప్పాలన్నారు. మూసివేసే ఆలోచన విరమించుకొని క్రషింగ్ ప్రారంభించాలన్నారు. ఈ ఆందోళనలో రైతులు పడాల కొండలరావు, జూరెడ్డి రమేష్, తదితరులు పాల్గొన్నారు. అదేవిధంగా ఏపీ చెరకు రైతు సంఘం ఆధ్వర్యంలో రైతు సంఘం నాయకులు ఫ్యాక్టరీ గేటు వద్ద నిరసన తెలిపారు. చెరకు రైతులను ప్రభుత్వం నిర్లక్ష్యం చేస్తే ఉద్యమాన్ని మరింత ఉధృతం చేస్తామని రైతు సంఘం నాయకులు కర్రి అప్పారావు, శ్రీనివాసరావు హెచ్చరించారు.

నేడు ఛత్రపతి శివాజీ మహరాజ్ నాటక ప్రదర్శన

మునగపాక: మరో చారిత్రక నాటక ప్రదర్శనకు మునగపాక వేదికైంది. ఆదివారం స్థానిక నందీశ్వర తులసీ కళావేదికపై సుమారు 60 మంది కళాకారులతో పేరుగాంచిన జయహో శ్రీఛత్రపతి శివాజీ మహరాజ్ నాటక ప్రదర్శన నిర్వహణకు ఏర్పాట్లు చేశారు. మునగపాక గ్రామ అభివృద్ధి ప్రదాత, దివంగత పెంటకోట జనరాజ్‌దాస్ 67వ జయంతిలో భాగంగా రాత్రి 7 గంటలకు ఈ నాటక ప్రదర్శన ఉంటుంది. గ్రామీణ యువజన సాంస్కృతిక సంస్థ, గ్రామీణ యువజన మందిరం సంయుక్త నిర్వహణలో కళాభిమానులకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా ప్రత్యేక ఏర్పాట్లు చేస్తున్నారు. విజయవాడకు చెందిన సీబీఆర్ అకాడమీ ఆఫ్ స్పోర్ట్స్ అండ్ ఎడ్యుకేషన్ ఆధ్వర్యంలో డాక్టర్ రామన్ ఫౌండేషన్ శ్రీసాయిబాబా నాట్యమండలి సభ్యులు ఈ ప్రదర్శన ఇవ్వనున్నారు. అనంతరం సినీ, నాటక రంగానికి ఎంతో మంది కళాకారులను అందించిన సినీ మేకర్ ఎల్.సత్యానంద్‌ను సత్కరించనున్నట్టు సాంస్కృతిక సంస్థ కన్వీనర్ సూరిశెట్టి రాము తెలిపారు. కళాభిమానులు తరలివచ్చి నాటక ప్రదర్శనను విజయవంతం చేయాలని కోరారు.

'ఆరోపణలు అర్థరహితం'

అనకాపల్లి: పరవాడలో దొరికిన నకిలీ మద్యం వెనుక టీడీపీ నాయకులు ఉన్నారని చేసిన ఆరోపణ పూర్తిగా అవాస్తవమని, రాజకీయ నాయకులకు పై కేసు విషయంలో ఎటువంటి సంబంధం లేదని జిల్లా ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ అధికారి వి.సుధీర్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈనెల 11న సాక్షి పత్రికలో ప్రచురితమైన 'కూటమి పాలన అంతా నకిలీ మయం' అనే వార్తలో ఎమ్మెల్సీ వరుదు కల్యాణి చేసిన ఆరోపణ ఆధారరహితమని ఆయన పేర్కొన్నారు. అచ్యుతాపురం మండలంలో పట్టుబడిన 17 లీటర్ల నకిలీ మద్యం స్వాధీనం చేసుకుని పరవాడకు చెందిన యలమంచిలి వెంకటేశ్వరరావు అనే వ్యక్తిని అదుపులోనికి తీసుకున్నామని చెప్పారు. అదేవిధంగా 'నకిలీ మద్యంలో ఎక్సైజ్ శాఖే నివ్వెరపోతోంది' శీర్షికన ప్రచురితమైన వార్తకు జిల్లా ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ అధికారి వివరణ ఇస్తూ.. ప్రముఖ బ్రాండ్ల పేరుతో సీసాల్లో నకిలీ మద్యం నింపుతున్నారని, మాజీ మంత్రి పేర్ని నాని చేసిన ఆరోపణ పూర్తిగా అవాస్తవమని, డిస్టలరీల నుంచి వచ్చే మద్యాన్ని ల్యాబ్‌లో పరిశీలించి, ప్రమాణికానికి తగినట్లు ఉంటే తప్ప విక్రయాలకు అనుమతులు ఇవ్వడం లేదన్నారు. అనకాపల్లి జిల్లాలో గతంలో 3 స్పూరియస్ లిక్కర్ కేసులు నమోదు చేశామని, 12 మందిని అరెస్టు చేసి, 424.26 లీటర్ల నకిలీ మద్యం, ఒక కారు, 2 మోటార్ సైకిళ్లను స్వాధీనం చేసుకున్నామని పేర్కొన్నారు.

ఆరిపోయిన ఆశల దీపం

- బైకును ఢీకొన్న కారు
- తమ్ముడు మృతి, అన్నకు గాయాలు
- విజయరామరాజుపేట రోడ్డులో ఘటన



హర్షవర్ధన్(ఫైల్)

బుచ్చెయ్యపేట: ఆశల దీపం ఆరిపోయింది. అల్లారుముద్దుగా పెంచుకున్న చిన్న కుమారుడిని కారు రూపంలో మృత్యువు కబళించింది. ఆ కుటుంబంలో తీవ్ర విషాదం నింపింది. బుచ్చెయ్యపేట మండలం విజయరామరాజుపేట, కోనాం ఆర్అండ్‌బీ రోడ్డులో శనివారం ద్విచక్ర వాహనం, కారు ఢీకొన్నాయి. ఈ ఘటనలో తమ్ముడు మృతి చెందగా.. అన్న గాయాలతో బయటపడ్డాడు. ప్రమాదానికి కారణమైన కారు డ్రైవర్ మృతుడ్ని ఆస్పత్రిలో చేర్పించి పరారయ్యాడు. బుచ్చెయ్యపేట అదనపు ఎస్ఐ భాస్కరరావు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. కుముదాంపేట గ్రామానికి చెందిన ఆది గిరిబాబు, లక్ష్మీకుమారిలకు ఇద్దరు కుమారులు. పెద్ద కుమారుడు బాబీ బీటెక్, రెండో కుమారుడు హర్షవర్ధన్(19) ఇంటర్ సెకండియర్ విశాఖలోని ఓ ప్రైవేటు కాలేజీల్లో చదువుతున్నారు. శనివారం సాయంత్రం అన్నదమ్ములిద్దరూ ద్విచక్ర వాహనంపై వడ్డాది వెళ్లి స్వగ్రామం కుముదాంపేటకు తిరిగి వస్తుండగా అప్పలరాజుపురం నుంచి చోడవరం వైపు వెళ్తున్న కారు ఢీకొంది. కుముదాంపేట గ్రామ సమీపంలో దాడి సత్యనారాయణ కళ్లాల వద్ద మలుపులో ఈ ఘటన చోటు చేసుకుంది. ఈ ప్రమాదంలో బైక్‌పై ఉన్న సోదరలిద్దరూ రోడ్డుపై తుళ్లిపడిపోయారు. స్పృహ తప్పిపడిపోయిన హర్షవర్ధన్‌ను అదే కారులో చికిత్స నిమిత్తం చోడవరం ప్రభుత్వ ఆస్పత్రికి తరలించగా.. ఆస్పత్రి సిబ్బంది పరీక్షించి మృతి చెందినట్లు నిర్ధారించారు. దీంతో ప్రమాదానికి కారణమైన కారు డ్రైవర్ అక్కడ నుంచి పరారయ్యాడు. బాబీకి స్వల్ప గాయాలయ్యాయి. వ్యవసాయం చేసుకుని జీవించే గిరిబాబు కుమారులిద్దరిని ప్రయోజకుల్ని చేయాలని ఉన్నత చదువులు చదివిస్తున్నాడు. ప్రయోజకుడు అవుతాడనుకున్న కుమారుడి మృత్యు ఒడికి చేరడంతో తల్లిదండ్రులు, కుటుంబ సభ్యులు భోరున విలపిస్తున్నారు. మృతుడి తండ్రి గిరిబాబు ఇచ్చిన ఫిర్యాదు మేరకు బుచ్చెయ్యపేట అదనపు ఎస్ఐ భాస్కరరావు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నారు. పోస్టుమార్టం నిమిత్తం హర్షవర్ధన్ మృతదేహాన్ని చోడవరం ప్రభుత్వ ఆస్పత్రి నుంచి అనకాపల్లి ఏరియా ఆస్పత్రికి తరలించారు. ఆదివారం పోస్టుమార్టం నిర్వహించి, మృతదేహాన్ని కుటుంబ సభ్యులకు అప్పగిస్తామని పోలీసులు తెలిపారు.

కుటీర పరిశ్రమగా కల్తీ మద్యం తయారీ

- చంద్రబాబు హయాంలో కల్లుగీత కార్మికులకు తప్పని కష్టాలు
- రాష్ట్రాన్ని మద్యాంధ్రప్రదేశ్‌గా మార్చేశారు..
- కల్లుగీత కార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి దేముడు



మాట్లాడుతున్న కల్లుగీత కార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి యర్రా దేముడు

అనకాపల్లి: కూటమి ప్రభుత్వంలో పెద్దల అండ దండలతోనే కల్తీ మద్యం తయారీ కుటీర పరిశ్రమగా మారిందని ఏపీ కల్లుగీత కార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి యర్రా దేముడు ఆరోపించారు. స్థానిక సీఐటీయూ కార్యాలయంలో శనివారం సంఘం జిల్లా కార్యవర్గ సమావేశం జిల్లా అధ్యక్షుడు బత్తిన నాగేశ్వరరావు అధ్యక్షతన జరిగింది. ఈ సందర్భంగా దేముడు మాట్లాడుతూ మద్యం కంపెనీలకు దీటుగా అధునాతన యంత్రాలు ఏర్పాటు చేసి స్పిరిట్‌తో కల్తీ మద్యం తయారు చేసి ప్రజల ప్రాణాలతో చెలగాటమాడుతున్నారని విమర్శించారు. ప్రకృతి సిద్ధమైన తాటికల్లును కూటమి ప్రభుత్వం కనుమరుగు చేసి, కల్తీ మద్యాన్ని, అక్రమ మద్యాన్ని ప్రోత్సహిస్తుందన్నారు. చంద్రబాబు పాలనలో ఎప్పుడూ కల్లుగీత కార్మికులకు కష్టాలు తప్పడం లేదని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. నమ్మి ఓట్లేసిన పాపానికి గీత కార్మికులకు ప్రభుత్వం చుక్కలు చూపిస్తోందని విమర్శించారు. రాష్ట్రంలో 75 వేల బెల్ట్ షాపులను తక్షణం తొలగించాలని డిమాండ్ చేశారు. కల్తీ మద్యాన్ని అరికట్టి కల్లును ప్రోత్సహించాలని గీత కార్మికులు రోడ్డెక్కి 50 రోజుల పాటు ఆందోళ చేసినా ప్రభుత్వానికి కనిపించడం లేదా అని ప్రశ్నించారు. సంఘం జిల్లా అధ్యక్షుడు బత్తిన నాగేశ్వరరావు మాట్లాడుతూ కల్లుకు మార్కెట్ సౌకర్యం కల్పించాలి, గీత కార్మిక కుటుంబాలను ఆదుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా నాయకులు గండిపోయిన రాము, కె.ఈశ్వరరావు, కర్రి అప్పలరాజు, దొడ్డి నారాయణ, అనుసూరి నూకప్పరావు, పాత బాబు, నడిగట్ల తాత బాబు, నడిగట్ల సన్యాసిరావు పాల్గొన్నారు.

ఏలేరు కాలువలో కాలుజారి మృత్యువాత

అనకాపల్లి టౌన్: మండలంలో తుమ్మపాల చెర్లొపల్లి కాలవలో అదే తుమ్మపాల గ్రామం, గవరపేటవీధికి చెందిన కొణతాల సత్యనారాయణ(54) ఈనెల 10 రాత్రి సమయంలో బహిర్భూమికి వెళ్లి ప్రమాదవశాత్తూ ఇంటివద్ద ఉన్న ఏలేరు కాలువలో కాలుజారి మృత్యువాత పడ్డాడు. బహిర్భూమికి వెళ్లిన వ్యక్తి మరుసటి రోజు ఉదయం వరకూ తిరిగిరావపోవడంతో పట్టణ పోలీసులకు శనివారం మృతుడు భార్య లక్ష్మీకుమారి ఫిర్యాదు చేసింది. సంఘటనా స్థలానికి పట్టణ ఎస్ఐ భాస్కర్‌రావు తమ సిబ్బందితో ఏలేరు కాలువలో పరిశీలించగా సత్యనారాయణ మృతదేహాన్ని గుర్తించడం జరిగిందన్నారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఎన్టీఆర్ ఆస్పత్రికి తరలించి, కేసు నమోదు దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్ఐ చెప్పారు.

రౌడీషీటర్ హత్యకేసులో కొత్తకోణం

- తొలుత పవన్ అనే వ్యక్తిపై గౌరీశంకర్ టీమ్ హత్యాయత్నం
- అనంతరం రౌడీషీటర్ శ్రీధర్‌ను మరో మహిళతో కలిసి హత్య చేసిన వైనం
- రెండు ఘటనల్లో నలుగురిని అరెస్ట్ చేసిన పోలీసులు
- ద్వారకా ఏసీపీ నరసింహమూర్తి వెల్లడి



వివరాలు వెల్లడిస్తున్న ఏసీపీ అన్నెపు నరసింహమూర్తి

ఎంవీపీకాలనీ(విశాఖ): విజయవాడకు చెందిన రౌడీషీటర్ శ్రీధర్ హత్య కేసులో మరోకొత్త కోణం వెలుగు చూసింది. ఈ హత్యకేసులో నిందితుడైన యలమంచిలికి చెందిన రౌడీషీటర్ గౌరీశంకర్ తొలుత మద్దిలపాలెంలో పవన్ అనే వ్యక్తిపై హత్యాయత్నం చేసినట్లు పోలీసులు వెల్లడించారు. శ్రీధర్ హత్య, పవన్ అనే వ్యక్తిపై హత్యాయత్నం ఘటనలకు సంబంధించి నలుగురిని అరెస్ట్ చేసినట్లు తెలిపారు. ఈ ఘటనకు సంబంధించి శనివారం రాత్రి ఎంవీపీ కాలనీ పోలీసు స్టేషన్‌లో ద్వారకా ఏసీపీ అన్నెపు నరసింహమూర్తి విలేకరులకు వివరాలు వెల్లడించారు. రౌడీషీటర్లు శ్రీధర్, గౌరీశంకర్‌లు పాతకేసుల్లో భాగంగా ఈ నెల 7వ తేదీన విశాఖ జిల్లా కోర్టుకు వాయిదాకు హాజరయ్యారు. అనంతరం విశాఖలోని పలు ప్రాంతాల్లో కారులో తిరుగుతూ మద్యం సేవించారు. గౌరీశంకర్‌కు విశాఖలో సాయి అనే స్నేహితుడు ఉన్నాడు. అతనికి పవన్ అనే వ్యక్తికి కొంతకాలంగా గొడవలు ఉన్నాయి. ఈ క్రమంలో పవన్‌ని హత్య చేయాలని గౌరీశంకర్, సాయి ఇటీవల నిర్ణయించుకున్నారు. ఈ క్రమంలో గౌరీశంకర్, శ్రీధర్, సాయి, అసీఫ్(సాయి స్నేహితుడు) కలిసి పవన్‌పై హత్యాయత్నానికి ప్రయత్నించారు. 7వ తేదీ రాత్రి మద్దిలపాలెంలో ఈ ఘటన చోటుచేసుకుంది. అయితే ఈ దాడి నుంచి పవన్ తప్పించుకొని పోలీసులకు సమాచారం ఇవ్వడంతో ఎంవీపీ పోలీసులు ఘటన స్థలానికి చేరుకొని ఆరా తీశారు. ఈ ఘటనపై కేసు నమోదు చేసిన పోలీసులు తొలుత సాయిని అదుపులోకి తీసుకున్నారు. విచారణలో ఈ హత్యాయత్నంలో తనతో పాటు గౌరీశంకర్, అసీఫ్‌లు కూడా ఉన్నట్లు సాయి వెల్లడించాడు. దీంతో పోలీసులు వారిని కూడా అదుపులోకి తీసుకొని విచారించి హత్యాయత్నంలో భాగస్వాములను చేశారు.

చాకచక్యంగా వ్యవహరించిన పోలీసులు

ఈ ఘటనలో పోలీసులు చాకచక్యంగా వ్యవహరించడంతో రౌడీషీటర్ శ్రీధర్ హత్య వ్యవహారం వెలుగులోకి వచ్చింది. పవన్‌పై హత్యాయత్నం కేసు నమోదు చేసిన పోలీసులు తొలుత అదే కోణంలో దర్యాప్తు చేశారు. అయితే సెల్ టవర్ సిగ్నల్ పరిశీలించినప్పుడు గౌరీశంకర్ నెంబర్ సిగ్నల్ ఉన్న ప్రతీచోట మరో వ్యక్తి నెంబర్ వ్యక్తి కూడా కనిపించింది. అయితే ఆ వ్యక్తి ఎవరనే విషయంపై ఎంవీపీ పోలీసులు తొలి నుంచి అనుమానం వ్యక్తం చేశారు. పలు సిగ్నల్ పాయింట్‌ల్లో పరిశీలించినప్పుడు కూడా ఇదే పరిస్థితి ఉండటంతో ఆ నెంబర్ ఎవరిదనే విషయంపై ఆరాతీశారు. ఈ విషయంపై గౌరీశంకర్‌ను తమదైన శైలిలో మరోసారి విచారించగా అసలు విషయం బయటపడింది. తొలుత 7వ తేదీ ఉదయం కోర్టుకు హాజరైన అనంతరం గౌరీశంకర్, శ్రీధర్ మద్యం సేవిస్తూ నగరంలో పలుచోట్ల తిరిగారు. అనంతరం శ్యామల అనే మహిళ ఇంటికి వెళ్లారు. రాత్రి మద్దిలపాలెంలో పవన్ అనే వ్యక్తిపై హత్యాయత్నం ఘటనలో పాల్గొన్నారు. తరువాత గౌరీశంకర్, శ్రీధర్ శ్యామల కలిసి కారులో అక్కడ నుంచి పరారయ్యారు. తరువాత గౌరీశంకర్, శ్రీధర్ మధ్య గొడవ చోటుచేసుకుంది. ఈ క్రమంలో గౌరీశంకర్, శ్యామల.. శ్రీధర్‌ను హత్యచేసి యలమంచిలిలోని పోలవరం కెనాల్‌లో పడేశారు. ఈ కేసులో చాకచక్యంగా వ్యవహరించిన ఎంవీపీ పోలీసులను ఏసీపీ నరసింహమూర్తి ప్రశంసించారు. రెండు కేసుల్లో గౌరీశంకర్‌తో పాటు శ్యామల, సాయి, అసీఫ్‌లను అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించినట్లు తెలిపారు. కార్యక్రమంలో ఎంవీపీ సీఐ ప్రసాద్, ఎస్ఐ ధనుంజయ్‌నాయుడు తదితరులు పాల్గొన్నారు.

చేపల వేటకు వెళ్లిన యువకుడి గల్లంతు



బంగార్రాజు(ఫైల్)

పరవాడ: చేపల వేటకు వెళ్లిన ఓ యువకుడు సముద్రపు కెరటాల తాకిడికి పడవ నుంచి జారి గల్లంతైన విషాద ఘటన పరవాడ మండలం ముత్యాలమ్మపాలెం తీరంలో శనివారం తెల్లవారుజామున చోటుచేసుకుంది. ఈ ప్రమాదంలో ముత్యాలమ్మపాలెం సమీపంలోని దిబ్బపాలెం గ్రామానికి చెందిన అరిజిల్లి బంగార్రాజు (17) ప్రాణాలు కోల్పోయాడు. చేతికి అందివచ్చిన కొడుకు సముద్రపు రాక్షస అలలకు బలై తమను అనాథలను చేశాడని మృతుడి కుటుంబ సభ్యులు కన్నీరుమున్నీరయ్యారు. మృతుడు బంగార్రాజుతో పాటు తోటి మత్స్యకారులు చింతకాయల కొర్లయ్య, కొండబాబు, మధు, హరి, మేరిగి ముత్యాలు... మొత్తం ఆరుగురు మత్స్యకారులు కలిసి ఒక తెప్పపై శనివారం తెల్లవారుజామున 2:30 గంటల సమయంలో చేపల వేటకు బయలుదేరారు. తీరాన్ని దాటి సముద్రంలోపలికి వెళ్తున్న క్రమంలో, సముద్రంపై నుంచి ఉధృతంగా వచ్చిన బలమైన కెరటం వీరు ప్రయాణిస్తున్న తెప్పను బలంగా ఢీకొట్టింది. ఆ సమయంలో తెప్పలో ఉన్న బంగార్రాజు ఒక్కసారిగా సముద్రంలో పడిపోయాడు. వెంటనే స్పందించిన తోటి కార్మికులు సముద్రంలో గాలించినప్పటికీ ఫలితం దక్కలేదు. అనంతరం మరో మూడు తెప్పలపై బంగార్రాజు ఆచూకీ కోసం గాలించినా ప్రయోజనం కనిపించలేదు. ప్రమాద సమాచారాన్ని అందుకున్న పరవాడ సీఐ ఆర్. మల్లికార్జునరావు తన సిబ్బందితో వెంటనే ఘటనా స్థలానికి చేరుకుని సహాయక చర్యలు చేపట్టారు. ప్రమాదానికి గల కారణాలను స్థానికులను అడిగి తెలుసుకున్నారు. తహసీల్దార్ బి.నాగరాజు కూడా ఘటనా స్థలాన్ని సందర్శించి, గల్లంతైన మృతదేహం కోసం గాలింపు చర్యలు ముమ్మరం చేయాలని జిల్లా ఉన్నతాధికారులకు సమాచారం అందించారు. శనివారం ఉదయం నుంచి మృతుడి జాడ కోసం పూడిమడక, పెదగంట్యాడ తీర ప్రాంతాల వరకు పడవలపై విస్తృతంగా గాలించారు. సాయంత్రానికి కూడా మృతుడి ఆచూకీ లభించకపోవడంతో కుటుంబ సభ్యులు కన్నీరుమున్నీరుగా విలపించారు. జనసేన మండల ఇన్‌చార్జ్ పంచకర్ల ప్రసాద్, సర్పంచ్ చింతకాయల సుజాత మృతుడి కుటుంబ సభ్యులను పరామర్శించి, ప్రమాద కారణాలను అడిగి తెలుసుకున్నారు. మృతుడికి తండ్రి అప్పన్న, తల్లి సత్యవతి, అక్క మౌనిక ఉన్నారు. మృతుడి ఆచూకీ కోసం రాత్రి వరకు గాలింపు చర్యలు ముమ్మరం చేసినప్పటికీ ఫలితం కనిపించలేదు.

'కంగారు' పడతారా? పెట్టిస్తారా

నేడు భారత్-ఆస్ట్రేలియా మ్యాచ్



సాధన చేస్తున్న క్రీడాకారిణి

విశాఖ స్పోర్ట్స్: ఐసీసీ వుమెన్ వరల్డ్ కప్‌లో అత్యంత రసవత్తరమైన పోరుకు విశాఖ వైఎస్సార్ స్టేడియం సిద్ధమైంది. వరుసగా మూడుసార్లు వరల్డ్ కప్ విజేతగా నిలిచిన డిఫెండింగ్ చాంపియన్ ఆస్ట్రేలియాతో గత రన్నరప్ భారత్ ఆదివారం డే-నైట్ మ్యాచ్‌లో ఢీకొట్టనుంది. ఈ పోరు మధ్యాహ్నం 3 గంటలకు ప్రారంభమవుతుంది. ఆడిన మూడు మ్యాచ్‌ల్లో ఐదు పాయింట్లతో ఆస్ట్రేలియా అగ్రస్థానంలో కొనసాగుతుండగా.. భారత్ నాలుగు పాయింట్లతో మూడో స్థానంలో ఉంది. గత మ్యాచ్‌లో ఓటమి పాలైన భారత జట్టు, ఈ మ్యాచ్‌లో విజయం సాధించి పుంజుకోవాలని పట్టుదలతో ఉంది. జట్టు కెప్టెన్ హర్మన్‌ప్రీత్ కౌర్ నాయకత్వంలో ఆటగాళ్లు శనివారం ప్రాక్టీస్‌లో శ్రమించారు.

మంధాన రికార్డుపై దృష్టి

భారత స్టార్ ఓపెనర్ స్మృతి మంధాన ఈ మ్యాచ్‌లో మరో 58 పరుగులు చేస్తే వన్డేల్లో 5,000 పరుగుల మార్కును చేరుకోనుంది.

టాస్ గెలిస్తే బౌలింగ్‌కు అనుకూలం

విశాఖలో వర్షాల కారణంగా పిచ్ కొద్దిగా తడిగా ఉండటంతో టాస్ గెలిచిన జట్టు లక్ష్య ఛేదనకే మొగ్గుచూపే అవకాశం ఉంది.

మిథాలీరాజ్ స్టాండ్, కల్పన ఎంట్రీల ప్రారంభం

భారత మాజీ కెప్టెన్ మిథాలీరాజ్ పేరిట ఒక స్టాండ్‌ను, ఆంధ్ర మహిళా క్రికెటర్ కల్పన పేరిట ఒక ప్రవేశద్వారాన్ని ఏర్పాటు చేశారు. రాష్ట్ర మంత్రి నారా లోకేష్ ఈ స్టాండ్, ప్రవేశద్వారాలను ప్రారంభించనున్నారు.

క్లుప్తంగా

ఏఎంసీ చైర్మన్‌గా రాము బాధ్యతలు

అనకాపల్లి: ఎన్టీఆర్ మార్కెట్ యార్డు చైర్మన్‌గా పచ్చికూర రాము శనివారం బాధ్యతలు స్వీకరించారు. స్థానిక రింగ్‌రోడ్డు బెల్లం మార్కెట్ ఆవరణలో శనివారం నూతన కార్యవర్గ ప్రమాణ స్వీకారానికి ఎంపీ సీఎం రమేష్, ఎమ్మెల్యే కొణతాల రామకృష్ణ, మాజీ ఎమ్మెల్యే పీలా గోవింద సత్యనారాయణ, మాజీ మంత్రి దాడి వీరభద్రరావు, మార్కెట్ కమిటీ కార్యదర్శి శకుంతల, చోడవరం ఎమ్మెల్యే కె.కె.రాజు హాజరయ్యారు. వైస్ చైర్మన్ సత్యనారాయణ, 11 మంది డైరెక్టర్లు ప్రమాణ స్వీకారం చేశారు.

'అవకతవకలపై చర్యలకు డిమాండ్'

అనకాపల్లి: మండలంలో వెంకుపాలెంలోని విశాఖ పాల సొసైటీలో అవకతవకలపై తక్షణమే జిల్లా అధికార యంత్రాంగం చర్యలు తీసుకోవాలని పాడి రైతు ఆడారి వెంకట అప్పారావు శనివారం ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. దీనిపై జూన్ 14న కలెక్టర్‌కు పీజీఆర్ఎస్‌లో లిఖిత పూర్వకంగా ఫిర్యాదు చేసినప్పటికీ ఎటువంటి స్పందన లేకుండా పోయిందని వాపోయారు. ఇప్పటికైనా పాల రైతులకు న్యాయం చేసే విధంగా జిల్లా అధికార యంత్రాంగం చర్యలు తీసుకోవాలని కోరారు.

వ్యవసాయ పనిముట్లపై జీఎస్టీ తగ్గింపు

కశింకోట: మండలంలోని కన్నూరుపాలెం, సుందరయ్యపేట గ్రామాల్లోని ప్రైవేటు పరిశ్రమల్లో పని చేస్తున్న ఉద్యోగులకు తగ్గించిన జీఎస్టీపై శనివారం మండల అధికారులు అవగాహన కలిగించారు. జీఎస్టీ వల్ల నిత్యావసర వస్తువులతోపాటు వ్యవసాయ పనిముట్లు, కార్లు తదితర ధరలు తగ్గాయన్నారు. వాటిని సద్వినియోగం చేసుకోవాలన్నారు. మండల ప్రత్యేక అధికారి సుభాషిణి, ఎంపీడీవో సీహెచ్ చంద్రశేఖరరావు, పంచాయతీ కార్యదర్శులు గంటి అభిషేక్, ఎ. నరసింగరావు తదితరులు పాల్గొన్నారు.

పిల్లలతో తల్లి అదృశ్యం



అదృశ్యమైన భూలక్ష్మి, పిల్లలు(ఫైల్)

యలమంచిలి రూరల్: పట్టణంలోని రాంనగర్‌కు చెందిన ఓ వివాహిత తన ఇద్దరు పిల్లలు అదృశ్యం కావడంపై ఆమె భర్త మరిసా వెంకటేశ్వర్లు పోలీసులకు ఫిర్యాదు చేశారు. పట్టణ ఎస్ఐ కె.సావిత్రి తెలిపిన వివరాలిలా ఉన్నాయి. రాంనగర్‌లో వెంకటేశ్వర్లు భార్య భూలక్ష్మి(30), కుమార్తె హేమ వర్షితశ్రీ(8), కుమారుడు దశ్వర్(6)తో నివసిస్తున్నారు. ఈ నెల 9వ తేదీ ఉదయం 5 గంటలకు వెంకటేశ్వర్లు డ్యూటీకి వెళ్లి మరుసటి రోజు ఉదయం 10.30 గంటలకు ఇంటికి వచ్చాడు. ఇల్లు తాళం వేసి ఉండడంతో తన భార్య, పిల్లలు ఎక్కడికి వెళ్లారని ఇంటి యజమానిని అడగ్గా.. ఈ నెల 9వ తేదీ సాయంత్రం 6.30 గంటల సమయంలో పుట్టింటికి వెళ్తున్నట్టు చెప్పారని ఇంటి యజమాని తెలిపాడు. అనంతరం వెంకటేశ్వర్లు అత్తింటికి ఫోన్ చేయగా తమ వద్దకు రాలేదని చెప్పారు. చుట్టు పక్కల ప్రాంతాల్లో వెతికినా ఆచూకీ తెలియకపోవడంతో ఆయన పోలీసులను ఆశ్రయించాడు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

బెల్లం ధరలు



అనకాపల్లి బెల్లం మార్కెట్‌కు శనివారం 160 దిమ్మలు వచ్చాయి.

దిమ్మల రకం	కనిష్ట ధర	గరిష్ట ధర
స్పెషల్ రకం	5,300	5,300
మొదటి రకం	4,600	5,100
రెండో రకం	4,090	4,550
మూడోరకం	4,000	4,060

అనకాపల్లి సినిమాలు

రాజా	: ఇడ్లీ కొట్టు (ఉదయం, మధ్యాహ్నం)
రాజా	: శశివర్ధన్ (ఫస్ట్, సెకండ్‌షో)
సత్యనారాయణ స్క్రీన్-1	: కాంతార
సత్యనారాయణ స్క్రీన్-2	: టీఆర్ఓఎన్ ఏఆర్ ఈఎస్(తెలుగులో)
పర్తిసాయి	: ఓజీ
షిర్డిసాయి	: అరి
వెంకటేశ్వర	: కానిస్టేబుల్
రామచంద్ర	: మిరాయ్

రక్త నిల్వలు

అనకాపల్లి: ఎన్టీఆర్ వైద్యాలయ రక్తనిధి కేంద్రంలో 85 యూనిట్ల రక్త నిల్వ ఉంది. ఏ పాజిటివ్-20, బీ పాజిటివ్-25, ఓ పాజిటివ్-33, ఏబీ పాజిటివ్-6 యూనిట్లు శుద్ధి చేసిన రక్తం నిల్వ ఉంది. అవసరమైన వారు వైద్యాలయం బ్లడ్‌బ్యాంక్ టెక్నీషియన్ యూలోకేష్(9703613706)ను సంప్రదించవచ్చు.

గ్యాస్ సమాచారం

అనకాపల్లి: ఇండేన్ గ్యాస్ ఏజెన్సీ ద్వారా శనివారం 391 మంది గ్యాస్ బుక్ చేసుకున్నారు. గతంలో బుక్ చేసుకున్న వారిలో 356 మందికి సిలిండర్లు సరఫరా చేశారు. వివరాలకు ఇండేన్ గ్యాస్ ఏజెన్సీ ప్రతినిధి (08924-223595)ని సంప్రదించవచ్చు.

- వర్షం కురిస్తే నిల్వ ఉంటున్న నీరు
- చెత్తా చెదారాలతో దుర్వాసన
- వాకర్స్, క్రీడాకారులకు ఇబ్బందులు

క్రీడా మైదానం.. అధ్వానం



క్రీడా మైదానంలో గణపతి నవరాత్రులకు వేసిన చెత్తాచెదారం

అనకాపల్లి:

పట్టణంలో ఎన్టీఆర్ క్రీడా మైదానం అధ్వానంగా తయారవుతోంది. జిల్లా కేంద్రంగా ఏర్పడిన తర్వాత ఇక్కడ పంద్రాగస్టు, గణతంత్ర వేడుకలతో పాటు ప్రభుత్వ కార్యక్రమాలు, సభలు నిర్వహిస్తున్నారు. అంతటి ప్రాధాన్యత కలిగిన ఈ మైదానంపై కూటమి పాలకులు నిర్లక్ష్య ధోరణి ప్రదర్శిస్తున్నారు. ఆగస్టులో భారీ వర్షాలకు బురదమయంగా మారడంతో స్వాతంత్య్ర వేడుకలకు ఇబ్బంది లేకుండా అధికారులు 20 లారీల క్రషర్‌బుగ్గి తెచ్చి చదును చేశారు. ఆ తర్వాత గణపతి నవరాత్రులు ఇక్కడే నిర్వహించారు. ఆ సమయంలో పడేసిన చెత్తాచెదారాలతో క్రీడాకారులు, వాకర్స్ తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు.

బురదమయంగా క్రీడామైదానం

వర్షపునీరు క్రీడా మైదానం నుంచి బయటకు పోయే మార్గం లేకపోవడంతో నిలిచిపోయి బురదమయంగా మారుతోంది.



స్టేడియం వద్ద దుర్వాసన వస్తున్న ప్రదేశం

నెల రోజులుగా వర్షపు నీరు ఉండిపోవడంతో దుర్వాసన, దోమలకు నిలయంగా మారింది. ఆర్మీ, పోలీసు, నేవీ రిక్రూట్‌మెంట్ సెలక్షన్‌కు వెళ్లే యువతీ యువకులు ఉదయం, సాయంత్రం సమయంలో ఇక్కడ రన్నింగ్, లాంగ్ జంప్, హైజంప్ కసరత్తు చేస్తుంటారు. వీరికి ఇబ్బందులు తప్పడం లేదు.



క్రీడా మైదానంలో ప్రధాన గేటు వద్ద చెత్త

క్రీడా మైదానాన్ని అభివృద్ధి చేయరా?

కూటమి పాలనలో క్రీడా మైదానం దుస్థితి దారుణంగా మారింది. ప్రజాప్రతినిధులు, అధికారులు కన్నెత్తి చూడకపోవడంతో క్రీడాకారులు, వాకర్స్ నిత్యం ఇబ్బందులు పడుతున్నారు. క్రషర్ బుగ్గను తొలగించి క్రీడాకారులు, వాకర్స్‌కు ఉపయోగపడే విధంగా క్రీడా మైదానాన్ని అభివృద్ధి చేయాలని కోరుతున్నారు.

ప్రభుత్వానికి ఎందుకంత కక్ష



నిత్యం సాయంత్రం మైదానంలో వాకింగ్ చేస్తున్నాను. ఆగస్టులో క్రషర్ బుగ్గ వేయడంతో మైదానం అంతా పాడైపోయింది. ఎత్తుపల్లాలుగా ఉండడంతో వాకర్స్‌తో పాటు నిత్యం క్రికెట్ ఆడే క్రీడాకారులకు ఇబ్బందులు తప్పడం లేదు. వాకింగ్ చేసే వృద్ధులు, మహిళలు ఇబ్బంది పడుతున్నారు. ప్రభుత్వ అధికారులు దృష్టి సారించి, క్రషర్ బొగ్గను తొలగించి, వర్షంనీరు నిల్వ లేకుండా చూడాలి.

– ఇ.కృష్ణ, వాకర్, ఎన్టీఆర్ క్రీడా మైదానం, అనకాపల్లి

చెత్తను తక్షణమే తొలగించాలి



మా స్వగృహానికి కూతవేటు దూరంలో ఉన్న మైదానానికి నిత్యం వాకింగ్‌కు వస్తుంటాను. గణపతి నవరాత్రుల సమయంలో ఇక్కడ చెత్తాచెదారం, సరుగుడు కర్రలు చిందరవందరగా వదిలేశారు. వాకింగ్ సమయంలో కాళ్లకు మేకులు గుచ్చుకుని తీవ్ర ఇబ్బందులు పడుతున్నాం. జోనల్ పారిశుద్ధ్య కార్మికులు తక్షణమే తొలగించాలి. క్రీడా మైదానం ఎదురుగా వర్షం నీరు నిల్వ ఉండడంతో దుర్వాసన రావడమే కాకుండా దోమలకు ఆవాసంగా మారింది. వాకింగ్ ట్రాక్‌ను అభివృద్ధి చేయాలి.

– వి.గణేష్, వాకర్, అనకాపల్లి

గౌరీపరమేశ్వరుల విగ్రహం ఊరేగింపు



వరిదుబ్బును తీసుకొస్తున్న భక్తులు



ఉత్సవ విగ్రహం ఊరేగింపులో భక్తులు

అనకాపల్లి: స్థానిక మెయిన్‌రోడ్డులోని పెరుగుబజార్ జంక్షన్ వద్ద కుంచావారి గౌరీపరమేశ్వరుల విగ్రహ నిలుపు మహోత్సవం శనివారం జరిగింది. కుంచావారి కుటుంబ సభ్యులు పట్టణంలో రఘురాం లేఅవుట్ వద్ద వరి దుబ్బును తీసుకుని వచ్చి అమ్మవారి ఆలయంలో ప్రదర్శనగా ఉంచారు. అమ్మవారి ఉత్సవ విగ్రహాన్ని పట్టణ పురవీధుల్లో ఊరేగించారు. ఆలయ ప్రతినిధి కుంచా చిన్ని మాట్లాడుతూ ఏటా డిసెంబర్‌లో అమ్మవారి ఉత్సవాన్ని ఘనంగా నిర్వహించడం జరుగుతుందన్నారు. కార్యక్రమంలో కుంచావారి కుటుంబ సభ్యులు, కమిటీ సభ్యులు, భక్తులు పాల్గొన్నారు.

వ్యక్తి అదృశ్యంపై ఫిర్యాదు



అదృశ్యమైన వెంకట రామారావు (ఫైల్)

పెందుర్తి: తన భర్త కనిపించడం లేదంటూ సుజాతానగర్‌లో నివాసం ఉంటున్న ఓ మహిళ పెందుర్తి పోలీస్ స్టేషన్‌లో శనివారం ఫిర్యాదు చేసింది. వివరాలివి.. సుజాతానగర్ లక్ష్మీనగర్‌లో పెద్దింటి వెంకట రామారావు (51), సువర్ణాదేవి నివాసం ఉంటున్నారు. ఈ నెల 6న ఇంటి నుంచి బయటికి వెళ్లిన రామారావు తిరిగి ఇంటికి రాలేదు. దీంతో బంధువులు, స్నేహితులను ఆరా తీశారు. ఫలితం లేకపోవడంతో సువర్ణాదేవి పోలీసులకు ఫిర్యాదు చేశారు. సీఐ కె.వి సతీష్‌కుమార్ ఆధ్వర్యంలో హెచ్‌సీ సత్యనారాయణ దర్యాప్తు చేస్తున్నారు.

వైద్యుల సమ్మెతో అందని 104 సేవలు

- సమ్మెలో పాల్గొన్న కింతలి పీహెచ్‌సీ వైద్యులు
- వైద్య సిబ్బందితో గ్రామాల్లో వైద్య సేవలు



కె.జె.పురం పీహెచ్‌సీ వద్ద 104 వాహనాలు

మాడుగుల రూరల్ : ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో పనిచేస్తున్న వైద్యులు సమ్మెతో గ్రామాల్లో 104 సేవలు పూర్తి స్థాయిలో అందక రోగులు ఇబ్బందులు పడుతున్నారు. పీహెచ్‌సీలో పనిచేసే వైద్యాధికారులు తమ న్యాయమైన కోర్కెలు సాధన కోసం ఈ నెల 1 వ తేదీ నుంచి సమ్మె బాట పట్టారు. దీనిలో భాగంగా మండలంలో కె.జె.పురం, కింతలి, ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు వున్నాయి. కె.జె.పురం పీహెచ్‌సీలో పనిచేసే వైద్యులు సమ్మెలో పాల్గొన్నలేదు. వారు తమ విధులును యథావిధిగా నిర్వహిస్తున్నారు. అయిన ఈ పిహెచ్‌సిలో పనిచేసే వైద్యాధికార్లు ఎల్.వి.ఎస్.ఎస్. ప్రసాదు పాత్రుడు, తో పాటు డాక్టర్ సందీప్ విధులు నిర్వహిస్తున్నారు. డాక్టర్ సందీప్‌ను డిప్యూటేషన్‌పై చీడిగుమ్మల పీహెచ్‌సీకి వేశారు. వైద్యులు సమ్మె వల్ల ఈ సర్దుబాటు వేసారు. ఈ పీహెచ్‌సీలో పనిచేసే ఆయుష్ వైద్యాధికారి వి. శ్రీదేవిని కింతలి పీహెచ్‌సీకి డిప్యూటేషన్ మీద వేశారు. ఈ పీహెచ్‌సీలో పనిచేసే ఇద్దరు వైద్యాధికారులు సమ్మెలో ఉన్నారు. కాగా పీహెచ్‌సీల్లో ఒక్కో వైద్యాధికారి విధులు నిర్వహించడం వల్ల గ్రామాల్లో జరిగే ఫ్యామిలీ ఫిజిషియన్ (104 సేవలు)కు ఆటంకం ఏర్పడింది. ప్రతి నెలలో ఏదో ఒక గ్రామంలో వైద్య సేవలు అందించాలి. వైద్యాధికారి, అయా సచివాలయం ఏఎన్ఎం, ఎంయల్‌హెచ్‌పి, కలిపి వైద్య సేవలు అందించనున్నారు. అయితే 104 వాహనాలు ఉదయం 9 గంటల నుంచి 12 గంటల వరకు అయా గ్రామాల్లోకి వెళ్లి ఏఎన్ఎంలు, ఎంఎల్‌హెచ్‌పీలు బీపీ, సుగర్, వ్యాధిగ్రస్తులను పరీక్షించి, మందులు అందజేస్తున్నారు. ఈ వాహనాలు వైద్యులు సమ్మె చెయ్యక ముందు ఉదయం 9 గంటలు నుంచి సాయంత్రం 4 గంటలు వరకు అయా గ్రామాల్లో వైద్య సేవలు అందించే వారు. దీంతో ఇప్పుడు వైద్యుల సమ్మెతో పూర్తి స్థాయిలో వైద్య సేవలు అందడం లేదని రోగులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. గ్రామీణ వైద్యుల సమస్యలు పరిష్కరించి వారి సమ్మెను విరమింపచేయాలని ప్రజలు కోరుతున్నారు.

మునగ సాగు.. లాభాలు బాగు

- చక్కటి ప్రభుత్వ సహకారం
- ఉపాధి హామీ పథకం నుంచి నిధుల మంజూరు
- మార్కెటింగ్ సదుపాయం



మునగ పంట



తవ్వవానిపాలెంలో సాగు చేస్తున్న మునగ పంట

నబ్బవరం: మునగ సాగుకు ప్రభుత్వం చేయూతనిస్తోంది. ఆరోగ్యాన్ని పరిరక్షించే పంట కావడంతో ఎక్కువ విస్తీర్ణంలో అధిక సంఖ్యలో రైతులు సాగు చేసేలా చూస్తోంది. డ్వామా ఆధ్వర్యంలో తోటల పెంపకం, పరిరక్షణకు నిధులు అందిస్తూ రైతులను ఆ దిశగా సన్నద్ధం చేస్తోంది. ప్రారంభంలో పెద్దగా ఆసక్తి చూపని రైతులు ఇప్పుడిప్పుడే మునగ సాగు వైపు మరలుతున్నారని అధికారులు చెబుతున్నారు.

పలు రాయితీలు..

మునగ సాగుకు ప్రభుత్వం అనేక రాయితీలు అందిస్తోంది. తోట వేసుకున్న నాటి నుండి రెండేళ్ల పాటు తోట నిర్వాహణకు రూ.లక్ష వరకూ రాయితీ అందిస్తోంది. ఈ సొమ్మును రైతులు తిరిగి చెల్లించనవసరం లేదని అధికారులు చెబుతున్నారు. రైతు 0.25 సెంట్ల నుండి ఒక ఎకరా వరకూ భూమిలో సాగు చేసుకోవచ్చు. రైతుకు డ్వామా సంస్థ ఉపాధి హామీ పథకం నుండి నిధులు సమకూరుస్తుంది. ఒక ఎకరాకు సుమారు 450 వరకూ మొక్కలు వేసుకోవలసి ఉంటుంది. మొక్కలు నాటేందుకు గుంతలు, ఎరువులకు ప్రభుత్వం ప్రోత్సాహం అందిస్తుంది. మునగతో పాటు అంతర పంటలను కూడా సాగు చేసుకునేందుకు అవకాశం కల్పిస్తుంది. ఇలా రెండేళ్ల పాటు తోట నిర్వహణకు ప్రభుత్వం సాయమందిస్తుంది.

సాంకేతిక, మార్కెటింగ్ సహాయం..

మునగ సాగులో మెరుగైన దిగుబడులు సాధించేందుకు ప్రభుత్వం ఉద్యాన శాఖ నుండి అవసరమైన సాంకేతిక సహాయం కూడా రైతులకు అందిస్తుంది. మునగ పంట విక్రయించడానికి రైతులకు అవసరమైన మార్కెటింగ్ సదుపాయం కల్పించడానికి కూడా ప్రభుత్వం రైతులకు తోడ్పడుతుంది.

పుష్కలంగా పోషకాలు..

మునగలో పోషకాలు పుష్కలంగా ఉంటాయని ఎన్నో పరిశోధనల్లో తేలింది. ప్రోటీన్లు, కాల్షియం, ఐరన్ మునగలో పుష్కలంగా ఉంటాయి. ఇందులోని అమినో ఆమ్లాల వల్ల జుట్టు, చర్మం, గోళ్లు ఆరోగ్యంగా ఉంటాయి. విటమిన్ సి వల్ల వ్యాధి నిరోధక శక్తి పెరుగుతుంది. పాలీఫినాల్స్, ఫైటో కెమికల్స్ శరీరంలోని మలినాలను బయటకు పంపించి రక్తంలోని ఫరియాడికల్స్‌ను నిర్మూలిస్తాయి. మునగాకు వల్ల రక్తహీనత సమస్య తొలగిపోతుంది. ఎముకులకు అవసరమయ్యే కాల్షియం సమృద్ధిగా లభిస్తుంది. ఇందులోని పొటాషియం అధిక రక్తపోటును క్రమబద్ధీకరిస్తుంది. మునగలో పీచు అధికంగా ఉండటం వల్ల జీర్ణప్రక్రియ సాఫీగా సాగేలా చేస్తుంది. మధుమేహం ఉన్నవారికి చక్కెర పనితీరును సమన్వయపరుస్తుంది. ఇటీవల ప్రకృతి వైద్యులు కూడా మునగాకులో పోషకాల గురించి తరుచూ అవగాహన కల్పిస్తున్నారు. వసతి గృహాలు, అంగన్‌వాడీ కేంద్రాల్లోని పిల్లలకు మునగ ఉత్పత్తులు ఆహారంగా ఇచ్చే ప్రక్రియ కొనసాగుతోంది.

మునగ సాగుతో అధిక ఆదాయం..

గత కొన్నేళ్లుగా పట్టణ, గ్రామీణ ప్రాంతాల ప్రజలు మునగాకు పొడి వినియోగం పట్ల ఆసక్తి కనబరుస్తున్నట్లు వైద్య నిపుణులు చెబుతున్నారు. ఈ క్రమంలో మునగ సాగును ప్రోత్సహిస్తే రైతులకు ఆదాయంతో పాటు ప్రజల ఆరోగ్య పరిరక్షణకు కూడా కృషి చేసినట్లు అవుతుందని ప్రభుత్వం భావిస్తోంది. మునగాకు, కాడలు, విత్తనాలు ఇలా అన్నింటినీ వినియోగించుకుని ఆదాయం పొందవచ్చని అధికారులు చెబుతున్నారు. ఇతర ప్రాంతాలకు సైతం ఈ ఉత్పత్తులను ఎగుమతి చేయవచ్చంటున్నారు.

గురునాథరావుకు ఘన నివాళి



గురునాథరావు విగ్రహానికి నివాళులర్పిస్తున్న వైఎస్సార్‌సీపీ నాయకులు

కశింకోట: మాజీ మంత్రి, మాజీ ఎంపీ దివంగత గుడివాడ గురునాథరావు జయంతి కార్యక్రమాన్ని వైఎస్సార్ సీపీ ఆధ్వర్యంలో శనివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా స్థానిక ఆర్టీసీ బస్ స్టేషన్ వద్ద గురునాథరావు విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఆయన అందించిన సేవలను ప్రస్తుతించారు.

కార్యక్రమంలో ఎంపీపీ కలగా లక్ష్మి, వైఎస్సార్ సీపీ మండల సచివాలయ కన్వీనర్ కలగా గున్నయ్యనాయుడు, మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ గొల్లవిల్లి శ్రీనివాసరావు, వైస్ ఎంపీపీ పెంటకోట జ్యోతి, వైఎస్సార్ సీపీ యువజన విభాగం జిల్లా ఉపాధ్యక్షుడు పెంటకోట శ్రీనివాసరావు, కశింకోట సర్పంచ్ మంత్రి జయరజని, యువ నాయకులు నీటిపల్లి దివాకర్, గోకవాడ గోవింద, గంగాధర్ తదితరులు కార్యక్రమంలో పాల్గొన్నారు. అదేవిధంగా స్థానిక వైఎస్సార్ సీపీ కార్యాలయంలో పార్టీ జిల్లా అధికార ప్రతినిధి మళ్ల బుల్లిబాబు ఆధ్వర్యంలో గురునాథరావు జయంతి కార్యక్రమాన్ని నిర్వహించారు. గురునాథరావు చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. పలువురు స్థానిక పార్టీ నాయకులు పాల్గొన్నారు.

సిటీ లెవల్ పార్కుకు శంకుస్థాపన



పార్కుకు శంకుస్థాపన చేస్తున్న వీఎంఆర్‌డీఏ చైర్మన్ ప్రణవ్‌గోపాల్, కమిషనర్ విశ్వనాథన్

అనకాపల్లి: ప్రశాంతమైన వాతావరణం కోసం పార్కులు అభివృద్ధి చేస్తున్నట్టు వీఎంఆర్‌డీఏ చైర్మన్ ఎం.వి.ప్రణవ్‌గోపాల్ తెలిపారు. మండలంలోని కొత్తూరు జాతీయ రహదారిలో ఏఎంఏఎల్ కళాశాల సమీపంలో 5.68 ఎకరాల విస్తీరణంలో రూ.4.5 కోట్లతో తలపెట్టిన సిటీ లెవల్ పార్కుకు శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ అనకాపల్లి సమీప గ్రామాల ప్రజలకు అవసరమైన సౌకర్యాలు, ఆధునిక వసతులు, పచ్చదనం పెంపు, అందమైన ప్రకృతి వాతావరణంలో పార్క్ నిర్మాణానికి రూపకల్పన చేయబడుతుందన్నారు. సైట్ లెవెలింగ్, కాంపౌండ్ వాల్, ప్రవేశ ద్వారం, టికెట్ కౌంటర్, వాచ్‌మెన్ గది నిర్మాణానికి రూ.1.45 కోట్లు, శౌచాలయాలు, అంతర్గత నడక మార్గాలు, నీటి సరఫరా, బోర్లుకు రూ. 1.60 కోట్లు, యువతకు వ్యాయామం పరికరాలు, పిల్లల కోసం ఆట పరికరాలు, ఓపెన్ జిమ్ పరికరాలు నిమిత్తం రూ 45 లక్షలు, కోటి రూపాయల ఖర్చుతో ఆధునిక లైటింగ్, సురక్షితమైన విద్యుత్ వ్యవస్థ, మౌలిక సదుపాయాలు కల్పిస్తామన్నారు. అనంతరం వీఎంఆర్‌డీఏ చైర్మన్ ఎం.వి. ప్రణవ్ గోపాల్‌ను శాలువాలతో సత్కరించి, అమ్మవారి చిత్రపటాన్ని ఎంపీ సీఎం రమేష్, ఎమ్మెల్యే కొణతాల రామకృష్ణ అందజేశారు. ఈ కార్యక్రమంలో విశాఖ మెట్రోపాలిటన్ కమిషనర్ కె.ఎస్.విశ్వనాథన్, సహాయ కమిషనర్ కె. రమేష్, మాజీ ఎమ్మెల్యే పీలా గోవింద సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

హిందుత్వమే శ్రీరామరక్ష



మాట్లాడుతున్న ఆర్ఎస్ఎస్ ప్రాంత కార్యకారిణి సదస్యులు యుగంధర్



హాజరైన ఆర్ఎస్ఎస్ కార్యకర్తలు

- ప్రాంత కార్యకారిణి సదస్యులు యుగంధర్

కశింకోట: హిందుత్వమే దేశానికి శ్రీరామ రక్ష అని ఆర్ఎస్ఎస్ ప్రాంత కార్యకారిణి సదస్యులు జి. యుగంధర్ తెలిపారు. శనివారం రాత్రి స్థానిక అరబిందో కల్యాణ మండపంలో ఆర్ఎస్ఎస్ విజయ దశమి ఉత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 1925లో విజయ దశమి పర్వదినాన రాష్ట్రీయ స్వయం సేవక్ సంఘ్(ఆర్ఎస్ఎస్) ఏర్పడిందన్నారు. దీన్ని పురస్కరించుకుని వందేళ్ల ఉత్సవాలు జరుపుకుంటున్నామన్నారు. దేశభక్తి కలిగిన సేవా సంస్థ అని తెలిపారు. అంతా ఐక్యంగా ఉండి హిందుత్వాన్ని, సనాతన ధర్మాన్ని పరిరక్షించుకోవాలన్నారు. వందేళ్లుగా ఆర్ఎస్ఎస్ కార్యకర్తలు ఇందుకు కృషి చేస్తున్నారన్నారు. ఎంపీ సీఎం రమేష్ మాట్లాడుతూ ఆర్ఎస్ఎస్ క్రమశిక్షణకు మారుపేరు అని, దేశంలో ఏ విపత్తులు వచ్చినా సేవలందిస్తారన్నారు. ఆర్ఎస్ఎస్ శాఖలు గ్రామ స్థాయిల్లో ఉండాల్సిన అవసరం ఉందన్నారు.

వారానికి ఒకసారైనా దీనిలో ప్రజలు పాల్గొవాలన్నారు. బీజేపీ జిల్లా అధ్యక్షుడు ద్వారపురెడ్డి పరమేశ్వరరావు మాట్లాడుతూ ఆర్ఎస్ఎస్ భావజాలాన్ని ప్రతి ఒక్కరూ అనుసరించి సేవా దృక్పథంతో ముందుకు సాగాలన్నారు. ఈ సందర్భంగా ఆర్ఎస్ఎస్ కార్యకర్తలు తెల్ల చొక్కా, ఖాకీ ప్యాంటు, పట్టా, టోపీ, షూ ధరించి ఆకర్షణీయంగా నిలిచారు. వారు యోగాసనాలు, ఇతర విన్యాసాలతో ఆకట్టుకున్నారు. అచ్యుతాపురం బ్రాండెక్స్ పరిశ్రమ భాగస్వామి పి.సి. దొరస్వామి, ఆర్ఎస్ఎస్ ప్రతినిధులు శిష్టి గోపి, సోమునాయుడు, శిష్టి అప్పారావు, తదితరులు పాల్గొన్నారు.

పొలాల్లో ధాన్యం, నాటుకోళ్లు అపహరణ



బుచ్చెయ్యపేటలో బాధిత రైతులు

బుచ్చెయ్యపేట : బుచ్చెయ్యపేట, శింగవరంలో గుర్తు తెలియని వ్యక్తులు రైతుల ధాన్యం, నాటు కోళ్లు, మేకపోతును పట్టుకుపోయారు. శుక్రవారం రాత్రి సుంకరి, శనివాడ వారి పొలాల్లో ఉన్న పాకల వద్ద నుంచి రైతులు తమ ఇళ్లకు వచ్చేశారు. శనివారం ఉదయం రైతులు తమ పాకల వద్దకు వెళ్లి చూడగా పాకల్లో ఉంచిన ధాన్యం బస్తాలు, గంపలు కింద దాచిన నాటుకోళ్లను దొంగలు పట్టుకుపోయినట్టు గుర్తించారు. బుచ్చెయ్యపేటకు చెందిన సుంకర నాగరాజువి 3 ధాన్యం బస్తాలు, 8 కోడి పుంజులు, సుంకర కొండబాబుకు చెందిన 6 ధాన్యం బస్తాలు, 6 కోడి పుంజులు, సుంకర అప్పారావు, చినబాబు, శ్రీనులకు చెందిన రెండు పుంజులు, రెండు పెట్టలను పట్టుకుపోయారు. గ్రామంలోనే పోలీస్‌స్టేషన్ ఉన్నా దొంగలు ధాన్యం బస్తాలు, నాటుకోళ్లు అపహరణకు గురికావడంతో రైతులు విస్మయం చెందుతున్నారు. ఎల్.శింగవరం గ్రామానికి చెందిన రేజం రాము ఇంటి ముందు కట్టిన మేకపోతును కూడా దొంగలు పట్టుకుపోయారు. సుమారు లక్ష రూపాయలు వరకు ఆస్తి నష్టం జరిగినట్టు బాధిత రైతులు వాపోతున్నారు.

బోధనేతర కార్యక్రమాలు బహిష్కరిస్తున్నాం



ఎంఈవోకు వినతిపత్రం అందిస్తున్న శేఖర్, శ్రీనివాసరావు

కె.కోటపాడు : పాఠశాలల్లో ఉపాధ్యాయులకు మితిమీరిన బోధనేతర కార్యక్రమాలతో వారి బోధనా సమయం హరించుకుపోతుందని అనకాపల్లి జిల్లా ప్రధానోపాధ్యాయుల సంఘం ప్రధాన కార్యదర్శి ఎ.శేఖర్, ఏపీటీఎఫ్ మండల శాఖ అధ్యక్షుడు సూర్రెడ్డి శ్రీనివాసరావు అన్నారు. ఏపీ ఉపాధ్యాయ సంఘాల సమాఖ్య ఆదేశాల మేరకు బోధనేతర పనులు, విద్యాశక్తి కార్యక్రమాన్ని బహిష్కరిస్తున్నట్టు తెలుపుతూ ఎంఈవో సత్యనారాయణకు వినతిపత్రం అందించారు. బోధనేతర పనులు కాని, గూగుల్ షీట్స్‌ను పూర్తి చేయడం, జీఎస్టీ 2.0, సీజనల్ ప్రచార కార్యక్రమాలను నిర్వహించబోమని తెలిపారు. ఉపాధ్యాయులు బి.శివప్రసాద్, సూర్రెడ్డి బాబూరావు, ఐ.అశోక్‌కుమార్, బోకం ప్రసాద్ పాల్గొన్నారు.

6ఏ కేసు బియ్యానికి 14న వేలం

నాతవరం : మండలంలో ఇటీవల పట్టుబడి 6ఏ కింద కేసు నమోదు చేసిన బియ్యానికి ఈనెల 14న వేలం పాట నిర్వహిస్తున్నామని తహసీల్దార్ ఎ.వేణుగోపాల్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. డి.యర్రవరం పౌరసరఫరాల గిడ్డంగి వద్ద భద్రపరిచిన బియ్యం 215 బస్తాలను బహిరంగ వేలం పాట నిర్వహిస్తామన్నారు.